కథ

# చందమామ రావె...

## "నాకు వుద్యోగం చేసే అమ్మాయి వద్దమ్మా!"

**వినయ్ ఆ మాటనేసరికి తండ్రి కృష్ణారావుకి మండుకొచ్చింది. కొడుకు వైపు గుర్రుగా చూశాడు.**

తల్లి యశోద ఆశ్చర్యపోయింది. ఇప్పుడొచ్చిన సంబంధం చాలా అనుకూలంగా వుంది. పిల్ల బాగానే వుంది. బ్యాంక్‌లో జాబ్ చేస్తోంది. నెలకు పది వేల రూపాయలు సంపాదిస్తోంది. కట్నం కింద తండ్రి హైదరాబాద్‌లో ఇల్లు ఇస్తానంటున్నాడు.

వినయ్‌కి కూడా హైదరాబాద్‌లోనే వుద్యోగం. ఇక ఇందులో వంక పెట్టాల్సింది ఏమిటో యశోదకు అర్థం కాలేదు.

''అదేమిట్రా ఇందులో నీకు నచ్చనిది ఏమిటి?'' అడిగింది యశోద.

''అదృష్టం అందలం ఎక్కిస్తుంటే, బుద్ధి బురదలోకి లాగిందంటారు ఇదేనే'' అని చిర్రుబుర్రులాడుతూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు కృష్ణారావు.

''చెప్పానుగదమ్మా! ఉద్యోగం చేసే అమ్మాయిని చేసుకోనని'' అన్నాడు వినయ్ విసుగ్గా.

''అదేరా! ఎందుకనీ అని?''

''ఎందుకనీ అంటే ఒక్కముక్కలో ఏం చెప్పాలి? నువ్వొకసారి హైదరాబాద్ వచ్చి కొన్నాళ్ళు వుండు. అక్కడ భార్యాభర్తలు, వుద్యోగాలు చేస్తున్న కుటుంబాలు చూపిస్తాను. వాళ్ళ తిప్పలు చూస్తే నీకే అర్థమవుతుంది'' అన్నాడు వినయ్.

''ఇద్దరూ వుద్యోగాలు చేస్తుంటే ఇబ్బందులు వుండేమాట నిజమే అనుకో. కానీ ఆ అమ్మాయి నెలకి పదివేలు...''

తల్లి మాటలకు అడ్డొచ్చి ''అమ్మా! మాట మాటకి పదివేలు, పదివేలు సంపాదిస్తోందని అంటున్నావెందుకు? నేను నెలకి ముప్ఫయి వేలు సంపాదిస్తున్నా. ఇంకా నాకు పదివేలు సంపాదించే పెళ్ళాం ఎందుకు?'' అన్నాడు వినయ్.

''డబ్బెవరికి చేదురా?''

''ఎక్కువైతే చేదేనమ్మా!''

''ఏమిట్రోరా నీ మాటలు నాకు అర్థమై చావటం లేదు. ఈరోజుల్లో అంతా అమ్మాయి జాబ్ చేస్తుందా? జీతం ఎంత? అని అడుగుతుంటే, నువ్వేంటిరా వుద్యోగం చేస్తున్న పిల్లని కాదంటున్నావు?''

వినయ్ నవ్వాడు.

''అమ్మా! గవర్నమెంటులో పనిచేస్తున్న గుమస్తాకు ఎంత జీతం వస్తుంది? ఐదువేలు. అటువంటివాడికి సంపాదించే భార్య అవసరమే. అవసరం కోసం ఎన్ని ఇబ్బందులైనా భరించాలి. నాకేం అవసరం? నేను సంపాదించేది ఎంతో ఎక్కువ''

కొడుకు వాదన నచ్చలేదు యశోదకు. నెలకి పదివేలంటే సంవత్సరానికి లక్ష ఇరవై వేలు. పది ఏళ్ళకి పది లక్షల పైమాటే. అదీగాక జీతం ఎప్పటికప్పుడు పెరుగుతూ పోతుంది.

''మాట మాటకీ ఇబ్బందులంటున్నావు? ఏమిట్రా అంత భరించలేని ఇబ్బందులు?''

''అవన్నీ అనుభవిస్తే తెలుస్తుందమ్మా! ఇద్దరూ వుద్యోగాలు చేసేవాళ్ళకి పిల్లలు పుట్టేవరకూ హాయిగానే వుంటుంది. ఇక పిల్లలు పుట్టాక తిప్పలు మొదలవుతాయి. పసి పిల్లని బడికి పంపే వయసొచ్చేవరకూ ఎక్కడుంచాలి? క్రెచ్‌లో అప్పజెప్పిపోవాలి. పాపం ఆ పసిపిల్ల తల్లిదండ్రులతో ఎప్పుడు గడుపుతుంది? మళ్ళీ తెల్లారకుండానే క్రెచ్‌లో పడేయడం. తల్లి వెళ్ళిపోతుంటే పసిపిల్ల గుక్కపట్టి ఏడవడం చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. ఇక ఏదైనా జర్వం వచ్చిందా తల్లి ఆఫీసుకి సెలవు పెట్టి వుండాలి.

నీకు తెలియంది ఏవుందమ్మా! బాలారిష్టాలు దాటేసరికి పిల్లలతో ఎంత ఇబ్బంది? జ్వరాలు, విరోచనాలు వంటివి వస్తూనే వుంటాయి. సరే! డబ్బు చాలనప్పుడు అవన్నీ భరించాలి.

కానీ నాకేమిటి? నాకు డబ్బు సంపాదించే పెళ్ళాం వద్దు. రోజూ ఇంటి కొచ్చేటప్పుడు బజార్లో వండిన కూరలు తెచ్చిపెట్టే పెళ్ళాం అసలే వద్దు.

ఇల్లు సమర్థవంతంగా చూసుకుని పిల్లల్ని ప్రేమగా పెంచే ఇల్లాలు కావాలి''

యశోదకు కొడుకు మాటల్లో యదార్థం గోచరించసాగింది. వాడు చెప్పేదీ నిజమే. పొద్దున్నే తల్లి ఒకవేపు, తండ్రి మరొకవైపు వెళ్ళిపోతే పిల్లల గతి ఏమిటి? వాళ్ళతో ముద్దుముచ్చట తీరేది ఎప్పుడు?

''ఏమోరా! మీ నాన్నకి ఈ సంబంధం బాగా నచ్చింది'' అన్నది.

''నాన్న డబ్బు మనిషిలే అమ్మా!'' అని నవ్వాడు వినయ్.

''ష్...గట్టిగా అనకు'' అన్నది.

''అమ్మా! నేను చిన్నతనంలో ఎట్లా పెరిగానో, నువ్వు నన్ను ఎంత ప్రేమగా పెంచావో, చందమామను చూపించి గోరుముద్దలు ఎలా తినిపించావో, బతిమాలి అవీ ఇవీ పెట్టి ఎలా పెద్దజేశావో, నా పిల్లలు కూడా అలాగే పెరగాలి. అదీ నా కోరిక.

చిన్నతనంలో తల్లిదండ్రుల ప్రేమ పొందలేని పిల్లల మానసిక స్థితి కూడా బాగుండదని చెప్తున్నారు.''

''సరేరా నీ ఇష్టం'' అన్నది యశోద.

★ ★ ★

కృష్ణారావుకు కొడుకు మీద కోపం వచ్చి సంబంధాలు చూడడం మానేశాడు.

''కక్కొచ్చినా, కళ్యాణం వచ్చినా ఆగుతుందా? ఆ శుభ ఘడియ వచ్చినప్పుడే వాడి పెళ్ళి జరుగుతుంది'' అంటుంది యశోద.

మూడునెలల తర్వాత సంక్రాంతి పండుగకి ఇంటికి వచ్చాడు వినయ్. అక్క బావ, వాళ్ళ పిల్లలతో సరదాగా గడపడం ఎంతో ఇష్టం వినయ్‌కి.

''సరేరా! ఇంకొన్నాళ్ళు ఆగరా! మా శ్రావణిని ఇచ్చి పెళ్ళి చేస్తాను. దానికీ చదువు రావడం లేదు'' అన్నది అక్క రాజేశ్వరి.

''సరే అక్కా! శ్రావణి నాకంటే ఓ ఇరవై ఏళ్ళు చిన్నది, అంతేగా! అడ్జస్టయి పోతాలే! ఏమంటావే'' అన్నాడు వినయ్ మేనకోడలితో.

''ఐ లవ్ యూ మావయ్యా!'' అన్నది పదేళ్ళ శ్రావణి.


అంతా నవ్వుకున్నారు.

ఇంతలో వీధిలో ఏవో కేకలు వినిపించాయి. వినయ్ ఇంట్లోనుంచి వీధిలోకి వచ్చాడు.

జులపాల జుట్టు జులాయిగాడిని ఒక అందమైన యువతి పట్టుకుని ఎడాపెడా వాయించేస్తోంది.

''నేనేమన్నాను? అసలు నిన్నేమనలేదు'' అని వాడు భయం భయంగా అంటున్నాడు.

**వాణిశ్రీ**



''అరేయ్! నాకు తెలుసురా నీ పోకిరీ చేష్టలు. చంపుతా మళ్ళీ ఈ వీధిలో కనిపిస్తే..'' ఆ యువతి రెచ్చిపోతోంది.

వినయ్‌కి ఆ దృశ్యం చూస్తే చూడముచ్చటగా వుంది. ఆడపిల్లలంతా ఈ అమ్మాయిలా ఆత్మవిశ్వాసంతో తిరగబడితే ఎంత బాగుండును అనుకున్నాడు.

వాళ్ళూ వీళ్ళూ వచ్చి వాడికి మరికాసిని వడ్డించి, ఆమెను శాంతింపచేసి పంపేశారు.

''ఎవరమ్మా ఆ అమ్మాయి? ఎక్కడో చూసినట్లుంది?'' అడిగాడు వినయ్.

''భాస్కర్రావుగారమ్మాయిరా! నీకు లెక్కలు చెప్పేవారు చూడు..పదేళ్ళక్రితం ట్రాన్సఫరై వెళ్ళిపోయారు. ఆయన రిటైరైపోయారు. ఇక స్వంత ఇంటికి వచ్చేశారు'' అన్నది యశోద.

వినయ్‌కి పదేళ్ళ క్రితం విషయాలు జ్ఞాపకం వచ్చాయి.

''యస్.. ఆమె కృష్ణవేణి''

చిన్నప్పుడు కృష్ణవేణి తనను ఏడిపించేది. తను అప్పుడు చాలా నెమ్మదిగా వుండేవాడు. లావుకూడా. ''మొద్దబ్బాయ్!'' అంటుండేది.

కృష్ణవేణి చిన్న పిల్లల్ని వెంటేసుకుని తిరుగుతుండేది. వాళ్ళతో దాగుడుమూతలు, తొక్కుడుబిళ్ళ వంటి ఆటలు ఆడుతుండేది. ఒక్కోసారి టీచర్ అవతారం ఎత్తేది. పిల్లల్ని వరండాలో కూర్చోబెట్టి బెత్తం పట్టుకుని పాఠాలు చెప్తుండేది.

తను కృష్ణవేణిని ''పిల్లల కోడి'' అని వెక్కిరించేవాడు.

వినయ్‌కి అప్పటి సంఘటనలన్నీ మధుర స్మృతుల్లా ముసురుకుని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

''అమ్మా! ఇప్పుడు కృష్ణవేణి ఏం చేస్తోందే! బాగా చదువుకుందా?'' తల్లిని అడిగాడు వినయ్.

''బి.ఇడినో ఏదో చేసిందిరా! ఇంట్లోనే పిల్లలకు ట్యూషన్లు చెప్తూ కాలక్షేపం చేస్తోంది''

''ఇంకా పెళ్ళి కాలేదేమిటమ్మా!''

''వాళ్ళ నాన్న పెద్దగా కట్నాలు ఇచ్చుకోలేడు. పోనీ పిల్లకేదైనా వుద్యోగం వుంటే, పోనీ నెలనెలా సంపాదించి తెస్తుందని చేసుకునే వాళ్ళు. ఉద్యోగం దొరకడం లేదు. పాపం వాళ్ళమ్మ అదే చెప్పుకుని బాధపడుతూ వుంటుంది'' అన్నది యశోద.

★ ★ ★

సాయంకాలం ఇంట్లోనుంచి బయల్దేరి భాస్కర్రావు మాష్టారింటికి వెళ్ళాడు.

అరుగుమీద పిల్లల్ని కూర్చోబెట్టి పాఠాలు చెప్తోంది కృష్ణవేణి. అటూ ఇటూ పచార్లు చేస్తూ ఆమెనే తదేకంగా చూస్తూ చిన్నగా నవ్వుతున్నాడు. ఆమె చూసినప్పుడు సైగలు చేస్తున్నాడు.

కృష్ణవేణి లేచి రయ్‌న వచ్చి ''ఏయ్!...'' అన్నది.

''ఏం పిల్లల కోడీ!'' అన్నాడు నవ్వుతూ.

ఆమెకు వెంటనే ఫ్లాష్‌బ్యాక్ గుర్తొచ్చింది. ఆమె ముఖంలో ఆనందం తాండవించింది. వినయ్‌ని పోల్చుకుంది.

''మొద్దబ్బాయ్!'' అన్నది పెద్దగా.

ఆమె కేకలు విని తల్లి వచ్చింది.

''అమ్మా! మొద్దబ్బాయే!'' అన్నది.

''ఎవరే?'' ఆమె గుర్తుపట్టలేకపోయింది వినయ్‌ని.

''వినయ్ అమ్మా! యశోద అత్తయ్య కొడుకు. మనింటికి ట్యూషన్‌కి వచ్చేవాడు. నేను మొద్దబ్బాయ్ అనేదాన్ని. తను నన్ను పిల్లల కోడి అనేవాడు'' కృష్ణవేణి పరవశంగా చెప్పుకుపోతోంది.

''నువ్వా వినయ్! రా లోపలికి. అక్కడే నిలబడ్డావేం?'' అన్నది.

''ఎక్కడా! ఈ పిల్లల కోడి లోపలకు రానిస్తేనా?'' అని నవ్వాడు. తర్వాత లోపలకు వెళ్ళి భాస్కరరావు మాష్టారితో కాసేపు మాట్లాడి వచ్చాడు.

★ ★ ★

కూతురు, అల్లుడు, మనుమరాలు, మనుమడు వెళ్ళిపోయాక ఇల్లంతా బోసిపోయినట్లు ఫీలయింది యశోద. ఇక రాత్రి బస్‌కి వెళ్ళిపోవడానికి సర్దుకుంటున్నాడు వినయ్.

కృష్ణారావు కొడుకుతో అంటీ ముట్టనట్లు వుంటున్నాడు. తను తెచ్చిన సంబంధాలు కాదంటున్నాడని కోపం. యశోద ఇద్దరిమధ్యా నలిగిపోతోంది. కొడుకు పెళ్ళి ఎప్పటికి అవుతుందోనని దిగులుపట్టుకుంది.

రోజులు మారిపోతున్నాయి. ఆడపిల్లలు తగ్గిపోతున్నట్లుగా అనిపిస్తున్నది.

''మా అబ్బాయికి మంచి అమ్మాయిని చూడమనేవాళ్ళేగానీ, మా అమ్మాయికి వరుడిని చూడమనేవాళ్ళు తగ్గిపోయారు.

చదువుకున్న అమ్మాయిలు కూడా ఏదో సంబంధం అని పెళ్ళి చేసుకోవడానికి సుముఖంగా లేరు. సిటీకి చేరిపోతే ఏదొక జాబ్ దొరుకుతుందన్న ధీమాగా వున్నారు.

బాగా డబ్బున్న కుటుంబాలవాళ్ళు 'అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీరా? అమెరికా వెళ్తాడా? లండన్ వెళ్తాడా?' అని ఆరాతీస్తున్నారు.

''కలికాలం దాపురించింది'' అని విసుక్కుంది యశోద. కొడుక్కి మారిపోతున్న కాలం గురించి వివరంగా చెప్పింది.

''మీ నాన్న పట్టించుకోవడం లేదురా! ఇక నీ పెళ్ళి ఎట్లా అవుతుందో?'' అని నిట్టూర్చింది.

''పోనీ నువ్వు పట్టించుకో అమ్మా!'' అని నవ్వాడు వినయ్.

''నేనా! నావల్ల ఏమవుతుందిరా? నేనెక్కడ తిరిగేది?'' విస్తుపోతూ అన్నది యశోద.

''ఎదురుగా పిల్లని పెట్టుకుని వూరంతా వెదకడం ఎందుకమ్మా?''

''ఎవర్రా ఆ పిల్ల?''

''అమ్మా! నేను కృష్ణవేణిని పెళ్ళి చేసుకుంటాను. నాన్నకి చెప్పు'' అన్నాడు.

''ఆ పొగరుబోతు పిల్లనా?'' ఆశ్చర్యపోతూ అన్నది.

''ఈ రోజుల్లో అట్లాగే వుండాలి ఆడపిల్ల. లేకపోతే నెగ్గుకు రాలేరు'' అని పక పక నవ్వాడు వినయ్.

★ ★ ★

''ఆడపిల్లలు చదువుకున్నంత మాత్రాన వుద్యోగం చేయాలనీ, అలా చేస్తేనే చదువుకు సార్థకత అని అనుకోవడం అవివేకం. చాలా మంది వంట చెయ్యడం, పిల్లల్ని పెంచడం చదువుకోని ఆడవాళ్ళకే పరిమితం అనుకుంటారు. అది తప్పు. తన సంసారాన్ని ఒడిదుడుకులు లేకుండా నడుపుకోవడం, పిల్లల్ని ప్రేమగా పెంచడం, చదివించి ప్రయోజకుల్ని చేయడానికి ఎంతో సమర్థత కావాలి. చదువుకోకపోయినా సంసారం సమర్థవంతంగా నిర్వహించిన ఆడది డాక్టరేట్‌తో సమానం. ఏమంటావు?'' అడిగాడు వినయ్.

కృష్ణవేణి నవ్వింది.

''మొద్దబ్బాయ్‌కి చాలా విషయాలు తెలుసే..'' అన్నది.

''సిటీ సంసారాలు చూసి నేర్చుకున్నా! నా పిల్లలకు కూడా నా చిన్ననాటి అనుభవాలు, తీపి ప్రేమలు, అమ్మనాన్నల అనురాగం ఆత్మీయత పుష్కలంగా కావాలి. ఓ.కే''

తల వూపింది కృష్ణవేణి.

''అంతగా కావాలంటే పిల్లలు స్కూల్‌కెళ్ళే వయసొచ్చాక ఏదైనా వుద్యోగం చేద్దువుగాని.. ఏం?''

''ఎందుకూ? నువ్విచ్చిన పెళ్ళాం వుద్యోగం చాలు'' అని పక పక నవ్వింది కృష్ణవేణి.

## సింగపూర్ వరుడితో మీనా పెళ్లి!

**చూస్తుంటే ఈ ఏడాది తారల పెళ్లిళ్ల సంవత్సరంగా చెప్పుకోవచ్చునేమో. ఇటీవలే సూర్య-జ్యోతికలు పెళ్లి చేసుకున్నారు. యువ హీరో కల్యాణ్ రామ్ వివాహం కూడా ఆమధ్య జరిగింది. అలాగే ఇప్పుడు మీనా! నిన్నటి మొన్నటి తార కుమారి మీనా త్వరలోనే శ్రీమతి మీనా కాబోతోంది. సింగపూరులో బిజినెస్ చేస్తున్న ఓ వరుడితో మీనా వివాహం ఈ ఏడాది ఆఖరులో జరగవచ్చని సినీ వర్గాల ఉవాచ. సినిమాలకు దాదాపు గుడ్‌బై చెప్పేసిన మీనా పెళ్లి తర్వాత గృహిణిగానే కంటిన్యూ అవుతుందని ఆమె సన్నిహితులు అంటున్నారు.**

